జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 18 నవంబర్ 2024
www.ntnews.com




ద్వాదశ మాసాల్లో కార్తికం కృష్ణుడికి అతి ప్రియమైనది. పరమ పవిత్రమైన ఈ పుణ్య కాలంలో.. విష్ణుమూర్తిని ఆరాధించిన వారికి స్వామి సాన్నిధ్యం లభిస్తుందని పద్మ పురాణం చెబుతున్నది. కార్తికంలో శ్రీకృష్ణుడి కోసం చేసే ఎంత అల్పమైన సేవ అయినా పరమపదాన్ని అనుగ్రహిస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు. ఈ మాసంలోనే కృష్ణభగవానుడు దామోదర లీలను ప్రదర్శించాడు. తన భక్తులను అనుగ్రహించాడు.

## దామోదరకృష్ణా జయహో!

**ఒకానొకసారి** బృందావనంలో ఇరుగుపొరుగు స్త్రీలంతా కలిసి యశోదమ్మ దగ్గరికి వచ్చారు. 'నీ ముద్దుల తనయుడు మా ఇళ్లల్లో కుండలను పగలగొట్టి వెన్నను దొంగలిస్తున్నాడని, వాటిని రక్షించుకునేందుకు మేమెన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకుండా ఉంద'ని వాపోయారు. అంతటితో ఆగక, ఇంట్లో బిడ్డకు ఆహారం ఇవ్వడానికి తగినంత శ్రద్ధ తీసుకోవడం లేదనీ, అందుకే కృష్ణుడు తమ ఇళ్లకు వస్తున్నాడనీ ఆరోపించారు. ఆ ఫిర్యాదులన్నీ విన్న యశోద.. చిన్ని కృష్ణుడి కోసం ప్రత్యేకమైన సువాసనగల వెన్నను సిద్ధం చేయాలని నిర్ణయించుకుంది. ఆమె ఆవులకు సువాసనతో కూడిన అత్యంత శ్రేష్ఠమైన గడ్డిని తినిపించింది. వాటి పాలతో పెరుగును సిద్ధం చేసి, వెన్న కోసం చిలకడం ప్రారంభించింది. ఇంతలో, చిన్నికృష్ణుడు ఆకలి అంటూ పాల కోసం యశోదమ్మ దగ్గరికి వచ్చాడు. బిడ్డను ప్రేమగా తన ఒడిలోకి తీసుకుని పాలు పట్టడం ప్రారంభించింది యశోద. అలా




కృష్ణుడు తల్లి పాలను తాగుతుండగా, వంటగదిలోంచి పాలు పొంగుతున్న శబ్దం వినిపించింది. వెంటనే బిడ్డను నేలపై ఉంచి యశోదమ్మ వంటగదిలోకి పరిగెత్తింది. ఆకలిగా ఉన్న కృష్ణుడు కోపంతో పక్కనే ఉన్న వెన్న కుండలను పగులగొట్టి, అమ్మ చూస్తే కొడుతుందని అక్కడి నుంచి పారిపోయాడు. తిరిగి వచ్చిన యశోదమ్మకు వెన్న కుండలన్నీ పగిలిపోయి ఉండటాన్ని చూసి ఏమి జరిగిందో ఊహించింది. కృష్ణుడు ఎక్కడంటూ వెతకగా, తమ ఇంట్లోనే మరో గదిలో వేలాడుతున్న కుండలోంచి వెన్న తింటూ కనిపించాడు. తాను తినడమే గాక బృందావనంలోని కోతులకు కూడా పంచిపెడుతుడుతున్నాడు. కోపగించుకున్న యశోదమ్మ, అతి కష్టం మీద కృష్ణుడిని చేజిక్కించుకొని తాడుతో రోకలికి కట్టేసేందుకు యత్నించింది. ఎంత ప్రయత్నించినా ఆ తాడు మాత్రం రెండంగుళాలు తక్కువ వస్తున్నది. ఎన్ని తాళ్లు తెచ్చి కట్టినా ప్రతిసారీ రెండంగుళాలు తగ్గుతున్నది! ఈ ఉదంతాన్ని విన్న ఇరుగుపొరుగు గోపికలంతా సంఘటనా స్థలానికి చేరుకొని యశోదమ్మ పడుతున్న కష్టాలను చూసి నవ్వడం ప్రారంభించారు. తాను తాడుకు బద్ధుడు కాకున్నా, తన తల్లి యశోదమ్మ మాతృవాత్సల్యంతో చూపే ప్రేమకు మాత్రం బద్ధుడయ్యాడు. తాడుకు కట్టుబడ్డాడు. తన భక్తులకు తానెన్నడూ బద్ధుడనేనని దామోదర లీలలో మరోసారి నిరూపించాడు ఆ దేవదేవుడు.

అంతర్జాతీయ హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదులవారు ఈ పవిత్ర కార్తికంలో ప్రతి ఒక్కరూ దామోదర వ్రతాన్ని ఆచరించాలని సూచించారు. ఈ వ్రతంలో భాగంగా దామోదరునిగా ఉన్న చిన్నికృష్ణుడిని దామోదరాష్టకంతో కీర్తిస్తూ నేతి దీపాన్ని సమర్పించాలి. హరేకృష్ణ మహామంత్రాన్ని గానం చేస్తూ కూడా దీపాన్ని సమర్పించవచ్చు.
హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే।
హరే రామ హరే రామ రామ రామ హరే హరే॥

... శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభూజీ, 93969 56984

## పున్నాగ! కానవే పున్నాగవందితు..

రాసలీలా వైభవం-4



మన పోతన మధురిమ 188 వ భాగం

**వేదార్థాన్ని నిర్ణయించే న్యాయాన్ని- పద్ధతిని తెలిపేది 'మీమాంసా' శాస్త్రం. ఇది పూర్వ (కర్మ, ధర్మ) మీమాంస, ఉత్తర (బ్రహ్మ, జ్ఞాన) మీమాంస అని రెండు విధాలు. పరమాత్మ, గోపకాంతల అంతరంగాలలో తన యెడల కల అమల అచలమైన ప్రేమను బహిరంగ పరచాలి అన్న ఉద్దేశ్యంతో తాను అపూర్వంగా పూర్వ మీమాంసను- ధర్మాచరణాన్ని సమర్థిస్తూ, వారికి ఉత్తర మీమాంస- జ్ఞానకాండ పరంగా వాదించే పటిమ- ప్రజ్ఞను ప్రసాదించాడు. తన సన్నిధికి విచ్చేసిన ప్రేమ యోగినులైన గోపికలను గోవిందుడు 'అపరాధినులు'గా బోను ఎక్కించాడు. 'ఇందువదనలారా! మీరందరూ ఆనందంగా మీ మందకు- బృందావనానికి మరలిపొండి. ఇక్కడ ఉండరాదు. వెళ్లండి- వెళ్లండి' అంటూ వెంటపట్టాడు. వారి కాళ్ల కింద కంప పెట్టాడు. ఇలా గడుసరియై శ్రీహరి వారిని పరిపరి విధాల పరీక్షకు గురిచేశాడు.**

'నన్ను మనిషిగా భావించి మదనాభిలాషతో వచ్చి ఉంటే యమసదనానికి వెళ్తారు. సమాజంలో అదనం- అధికంగా అప్రతిష్ఠపాలవుతారు' అని మదన మోహనుడు మొహమాటం లేకుండా హెచ్చరించాడు. అల్లా అనకపోతే వల్లవ (గొల్ల) వనితలకు నల్లనయ్య మీద ఉన్న వల్లమాలిన పరమ ప్రేమ ఎల్ల లోకాలకు వెల్లడి అయ్యేది కాదు కదా! యశోదానందనుడు గోవిందుడు ఆనందరూపుడైన భగవంతుడే అన్న అమంద- పరిపూర్ణ జ్ఞానం కలవారు గోపికలు. ఇదే వాస్తవ భక్తి. వారికి ఈ జ్ఞానం లేకపోతే అది అవ్వారి- విస్తారంగా జారిణుల- వ్యభిచారిణుల ప్రేమ వంటిదే అయ్యేది! అది మోహమే. నరక యాతన కలిగించేది. కాని, గోపి ప్రేమ పరాప్రేమ. అది పరావిద్య. బ్రహ్మవిద్యకు మారుపేరు!

గోపికలు అడిగారు- గోవిందా! వెనుకకు మరలి మేము ఏమి చెయ్యాలి? భగవంతుడు.. మీ గృహ- గృహిణీ (స్త్రీ)ధర్మాన్ని పాటించండి. గోపికలు.. దానికి ఫలం? పుణ్యం వస్తుంది. పుణ్యానికి ఫలం? పరమాత్మ అనుగ్రహం. దానికి ఫలం? భగవత్ప్రాప్తి! గోపికలు... స్వామీ! ఆ భగవంతుడు ప్రత్యక్షం- ఎదురుగా సిద్ధంగా ఉంటే, మా మీద కినుక పూని మమ్ములను విరుద్ధంగా వెనుకకు పొమ్మంటావేమిటి? పరోక్షం వెంట పడమంటావేమిటి? సిద్ధి లభించిన పిమ్మట కూడా సాధనను పట్టుకు వేలాడటం జడబుద్ధి కాదా జలజనయనా- జనార్దనా? 'మీ ఇళ్లలో ఉంటూనే నన్ను పూజించి ధ్యానించవచ్చు గదా!'- అన్నావు. అప్రతిమమైన చైతన్యాన్ని వదలి మతిమంతులు జడాలైన పటాలను, ప్రతిమలను అర్చిస్తారా? విశేషం రానంత వరకు సామాన్యం పట్టు వదలరాదు. విశేషం విచ్చేసినాక సామాన్యాన్ని పట్టుకోరాదు.

శుక ఉవాచ- రాజా! ఎడతెగక తాకుతున్న మన్మథ బాణాల కుదుపులకు అదుపు తప్పి ఓపికలు కోల్పోయిన గోపికలు పలికిన దీన వచనాలు విని యోగేశ్వరేశ్వరుడూ, ఆత్మారాముడు (తనలో తాను ఆనందించువాడు) అయిన శ్రీకృష్ణుడు నవ్వి వారితో క్రీడించాడు, వారిని రమింపజేశాడు..

మ॥ 'కరుణాలోకములం బటాంచల కచాకర్షంబులన్ మేఖలా
కర బాహు స్తన మర్శనంబుల నఖాంకవ్యాప్తులన్, నర్మ వా
క్పరిరంభంబుల మంజులాధర సుధాపానంబులం గాంతలం
గరగించెన్ రతికేళి గృష్ణుడు గృపం గందర్పు బాలార్చుచున్'

పొంగి పొరలే కృపతో కూడిన ఓర చూపులతో, చీరకొంగులను, శిరోజాలను లాగుచూ, మొలనూలు- పిరుదులు, భుజాలు, వక్షోజాల- పాలిండ్ల స్పర్శలతో, గోటి నొక్కులతో, నోటి నర్మ (ప్రియ) వాక్యాలతో, ఆలింగనాలతో, మధురమైన అధరామృత అస్వాదనలతో అంగజు (మన్మథు)ని గర్వాన్ని భంగపరుస్తూ పశుపాంగజుడు- నంద కుమారుడు బాల ముకుందుడు కరుణతో గోపభామలను కామకేళిలో కరిగించాడు. వారు చుట్టూ చేరి మక్కువతో తనను కొలుస్తుండగా, చొక్కపు చక్కదనాల పుట్టినిల్లైన నందుపట్టి చుక్కల్లో రిక్కల రాయని- చంద్రుని వలె మక్కిలి చక్కగా మెరిశాడు. వనమాలా విరాజితుడు, భువన సుందరుడు, వనజ దళాక్షుడు కృష్ణచంద్రుడు ఆ బృందావనానికి కనువిందై ఇందువదన- గోపాంగనలకు తన దివ్యమైన పొందుతో బ్రహ్మానందపు విందు గావించాడు.



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

ఉ॥ 'చిక్కక ఈశుడై యెదిరి జిక్కుల బెట్టెడి మాయలానికిం
జిక్కి కృతార్థులై మరుని చిక్కుల జొక్కి లతాంగు లుండగా
మక్కువ శాంతి సేయుటకు మన్నన సేసి ప్రసన్ను డౌటకుం
జక్కన నా విభుండు గుణశాలి దిరోహితుడయ్యె నయ్యెడన్'

శుకుడు- రాజా! ఇతురులెవ్వరికీ చిక్కక ఎదుటి వారిని పెక్కు చిక్కుల్లో ముంచే జగదీశుడు, అనితర- సాటిలేని టక్కుల మారి మాయలానికి దక్కి (స్వాధీనపడి) ధన్యత పొందిన సౌజన్య మూర్తులు గోపికలు కామకేళిలో సొక్కి సోలిపోయారు. మహానుభావుడైన (అసంగుడైన) మాధవునితో మార (మన్మథ) క్రీడలు తారస్థాయిలో ముదమారగ అనుభవిస్తున్న గోప వనితలు, తాము భూలోకంలోని స్త్రీలలో భూరి- అధిక భాగ్యవతులమని భావించి 'సౌభగ మదం'- గర్వం వహించారు. అభిమానం ఉన్నచోట 'అమాని'- వెన్నుడు ఉండడు. వారి కామోత్కంఠకు- పారవశ్యానికి, గర్వానికి శాంతి కలిగించేందుకు, అనంతరం ఆదరంతో అనుగ్రహించేందుకు అనంత కల్యాణ గుణ సంపన్నుడైన ఆ అరవిందాక్షుడు మురవైరి శౌరి అక్కడే అదృశ్యుడయ్యాడు.

ఈ అంతర్ధానానికి అంతరార్థం ఏమిటి? నిత్యుడు, సత్యుడు, అంతటా ఉన్నవాడు అంతర్ధాన- అదృశ్యమవగలడా? మానవుని కన్నులకు అహంకారమనే పొర- తెర అడ్డుపడితే అచ్యుతుడు కనిపించడు. గోపిక- జీవాత్మ అహంకారంతో ఉబ్బిపోగా పరమాత్మ కనుమరుగయ్యాడు. అక్కడే ఉన్నా మానవతులు- గోపికలు అబ్బురంగా అతనిని కానలేకపోయారు. ఈ 'వి'యోగం కూడా విలక్షణం! విశిష్టమైన యోగం! బహిరంగంలో వియోగమైనా అంతరంగంలో వింతైన సంయోగమే! రాధామాధవులు- గోపీకృష్ణులు ఎప్పుడూ ఏకరూపులే! మరి ఈ విరహం? ఇది లీలా మాత్రం. గోపికలు ప్రేమైక జీవులు. మద మానాలు, ముద రోదనలు, రాగ ద్వేషాలైనా వారికి మండనాలే- అలంకారాలే!

శుకయోగి.. రాజా! ఇలా హరి కనుగప్పి మరుగైన వేళ ఆయనను కనుగొనలేక, తాళ జాలక కరి- మగ ఏనుగును బాసి తిరిగే కరిణుల- ఆడ ఏనుగుల వలె ఉల్లము తల్లడిల్లగా వల్లవ కాంతలు వాసుదేవుని గమన (నడవడి) లీలలు, దరహాస విలాసాలు, వీక్షణలు- చూపులు, విహారాలు, సయ్యాటలు, పాటలు, మాటలు మొదలగు వాటిపై పెల్లుబికిన ప్రేమానురాగాలతో స్వాంతాలు- మనసులు పరవశింపగా తన్మయత్వంతో 'నేనే గోవిందుణ్ని, నేనే గోపాలుణ్ని' అని పలవరిస్తూ కనుమరుగైన శ్రీకృష్ణుని గుణాలను చేష్టలను అనుకరిస్తూ వనాలలో తిరుగసాగారు. రాజా! చరాచర భూతాల లోపల, వెలుపల వసించి వెలుగుతున్న వాసుదేవుని వల్లవ వనితలు యమునా తీరమందలి అడవులలో వెదకడానికి ప్రేమతో పాడుతూ వడివడిగా వెళ్లారు. కనిపించిన ప్రతి చెట్టును, తీగను అడిగారు. ఈ చోట బమ్మెర వారు భక్తి తన్మయత్వంలో పరవశించి పారాశరుని (వ్యాసుని) మించి కవితాశిల్పం పెంచి సమంచితంగా, అంతర్హితు- అదృశ్యుడైన కంత (మన్మథ) జనకుని, శ్రీకాంతుని భ్రాంతులై వెదకుతున్న గోపకాంతల ఆర్తిని. ఆవేదనను, ఆందోళనను రసోదంచితంగా కవితా కామినీ కిలకించితంగా వర్ణించి అలరించాడు..


సీ॥ 'పున్నాగ! కానవే పున్నాగవందితు;
తిలకంబ! కానవే తిలక నిటలు;
ఘనసార! కానవే ఘనసార శోభితు;
బంధూక! కానవే బంధుమిత్రు;
మన్మథ! కానవే మన్మథాకారుని;
వంశంబ! కానవే వంశధరుని
చందన! కానవే చందన శీతలు;
కుందంబ! కానవే కుందరదను;'
తే॥ 'నింద్రభూజమ! కానవే ఇంద్రవిభవు;
గువలవృక్షమ! కానవే కువలయేశు;
బ్రియకపాదప! కానవే ప్రియవిహారు;
ననుచు గృష్ణుని వెదకి రయ్యబ్జముఖులు'

ఓ పున్నాగ పాదపమా! పురుష పుంగవులచే ప్రణతులందుకొను వానిని నీవు పరికించావా? తిలకంబ!- ఓ బొట్టుగు చెట్టా! నుదుట కస్తూరి తిలకం ధరించిన వానిని తిలకించావా? ఘనసార!- ఓ కర్పూర వృక్షమా! గొప్ప బలిమి కలిమిచే శోభించు మా చెలిమికాణ్ని కనుగొన్నావా? బంధూక! ఓ మంకెన మహీజమా! అందరికీ ఆత్మబంధువు, ఆప్తమిత్రుడూ అయిన వానిని అవలోకించావా? మన్మథ!- ఓ వెలగ వృక్షమా! మన్మథునికే మన్మథుడయి వెలుగువానిని వీక్షించావా? వంశంబ!- ఓ వెదురు తరువా! వేణువు దాల్చిన వెన్నుని కన్నావా? చందన! ఓ చందన వృక్షమా! చందనం వలె చల్లనైన నల్లవానిని చూచావా? కుందంబ!- ఓ మొల్ల లతికా! మొల్లమొగ్గల వంటి పల్వరుసల వానిని పొడగన్నావా? ఇంద్రభూజమ!- ఓ మరువకమా! దేవేంద్రుని మించిన వైభవంతో విరాజిల్లు వానిని దర్శించావా? కువల వృక్షమ!- ఓ రేగు చెట్టా! కువలయ- అవనీ మండలానికి అధినాథుడైన వానిని అవలోకించావా? ప్రియక పాదప!- ఓ ప్రేంకణమా! ప్రియులతోటి విహార విలాస విభ్రమాలు కలవానికి పొడగాంచావా?.. అంటూ అరవిందాననలు బృందావనంలో నందసూనుని, అందాల కృష్ణుని అన్వేషించారు.

(సశేషం)

## జీవిత కాలం

**ఓ** ఆశ్రమంలో సత్సంగం జరుగుతున్నది. గాయకులు వినసొంపుగా పాటలు పాడుతున్నారు. ఆ పాటలకు తగ్గట్టు కొందరు నృత్యం చేస్తున్నారు. అక్కడే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దిగులుగా ఒక మూలన కూర్చుని ఉన్నాడు. ఆ యువకుడిని చూసిన గురువు, అతని దగ్గరికి వెళ్లి నృత్య బృందంలో నువ్వు కూడా పాల్గొనవచ్చు కదా! అని అడిగాడు. 'నా కష్టాలు అన్నీ ఇన్నీ కావు. నాకున్న సమస్యలు ఈ ప్రపంచంలో ఎవ్వరికీ ఉండవు. నా జీవితంలో ఆనందమనేదే లేదు!' అని




బాధగా అన్నాడు. దానికి గురువు 'ఓటీపీ అంటే నీకు తెలుసు కదా?' అని అడిగాడు 'అది అందరికీ తెలిసిందే! వన్ టైం పాస్‌వర్డ్' అని బదులిచ్చాడు ఆ యువకుడు. 'దాని కాల పరిమితి ఎంత?' అని మళ్లీ ప్రశ్నించాడు గురువు. 'కొన్ని సెకన్లు లేదా కొన్ని నిమిషాలు. ఆ కొద్ది సమయం గడిచిపోతే ఆ ఓటీపీ దేనికీ పనికి రాదు' అని సమాధానమిచ్చాడు యువకుడు. 'మన జీవితం కూడా అలాంటిదే. ప్రకృతి మనకు ప్రసాదించిన కాలమే మన జీవితం. ఆ కాలపరిమితి దాటితే మనం ఉండం. జరిగిపోయిన కాలం, ప్రవహించే నది ఎప్పటికీ వెనక్కి రావని తెలిసిందే కదా! కాబట్టి మనకున్న కాలం ఎంతో అమూల్యమైనదిగా భావించాలి. ప్రతి క్షణమూ మనకు విలువైనదే. దాన్ని పూర్తిగా ఆస్వాదించాలంటే మనం ఆనందంగా ఉండాలి. ఎదురైన కష్టాలనే పట్టుకుని ఉంటే చెప్పా పెట్టకుండా కాలం గడిచిపోతుంది. అందుకే ఈ జీవితకాలపు ఓటీపీని మనం సద్వినియోగం చేసుకోవాలి. ఆనందం అనేది ఎక్కడినుంచో రాదు. మన లోంచే వస్తుంది. సేవ చేయడం, సకల జీవరాశుల పట్ల ప్రేమ, ప్రకృతితో అనుసంధానం కావడం, వర్తమానంలో జీవించడం లాంటివి చేస్తే ఆనందం మన వెంటే ఉంటుంది' అని వివరించాడు గురువు. ఆ మాటల్లోని అంతరార్థం గ్రహించిన యువకుడు.. ఆనందంగా నృత్యబృందంలో చేరిపోయాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు, 93936 62821

## సమపాళ్లలో ఆహారం

**యోగ** శాస్త్రపరంగా ప్రతి మనిషిలో ఆరు చక్రాలు ఉంటాయి. వీటినే షట్చక్రాలు అంటారు. అవి మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధ, ఆజ్ఞాచక్రాలు. ఈ షట్చక్రాల్లోనే ప్రాణవాయువు సంచారం చేస్తుంటుంది. మనం తీసుకునే ఆహార పదార్థాల్లోని రుచులకు అనుగుణంగా ఆయా చక్రాలు చైతన్యవంతం అవుతాయి. అలాగే, మన ప్రాణవాయువు.. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన అనే అయిదు రకాలుగా ఉంటుంది. వీటిలో ప్రాణ- వగరు, అపాన- తీపి, వ్యాన- పులుపు, ఉదాన- కారం, సమాన- చేదు రుచులతో అనుసంధానమై ఉంటాయి. మనం తీసుకునే ఆహారంలో ఏ రుచి ఎక్కువగా ఉందో అందుకు అనుగుణంగా ఆ రకమైన ప్రాణవాయువు ఉత్తేజితమవుతుంది. షట్చక్రాలు, పంచప్రాణాలను యోగ శాస్త్ర పద్ధతుల ప్రకారం అదుపులో ఉంచుకోవటానికి కఠినమైన ఆహార నియమాలు పాటించాలి. ఏ ఒక్క ఆహారం (రుచి) మాత్రమే కాకుండా అన్ని రకాల రుచుల మేళవింపుగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఇలా రుచులన్నీ సమపాళ్లలో అందినప్పుడే శరీరం మనిషికి స్వాధీనంలో ఉంటుంది. అందుకే మన పెద్దలు ఉగాదికి ఆరు రుచుల పచ్చడిని నిర్దేశించారు. వివిధ పండుగల సందర్భంగా పలు రకాలైన ప్రత్యేక నివేదనలు సూచించారు.



... శ్రీ భారతి

## వాగ్దాన పాలన

ఇస్లాం బోధ



**వాగ్దాన** పాలనను గురుతరమైన బాధ్యతగా ఇస్లాం పేర్కొంది. అది ముస్లింల నైతికతలో భాగమని తెలిపింది. ఏ వ్యవహారంలో అయినా వాగ్దానం చేసినట్లయితే చివరి నిమిషం వరకు నిబద్ధతతో, బాధ్యతాయుతంగా వ్యవహరించి దానిని నెరవేర్చాలి. చేసిన వాగ్దానాలను, ప్రమాణాలను తప్పనిసరిగా నెరవేర్చాలి. అయితే సత్యం కలిగిన వ్యవహారాలకు మాత్రమే ఇవి వర్తిస్తాయి. ఎవరైనా తమ తాహతుకు, సామర్థ్యానికి మించి వాగ్దానం చేయకూడదు. ఒకవేళ అలా వాగ్దానం చేస్తే దానికి పరిహారం చెల్లించి వాగ్దాన భంగం చేయడమే ఉత్తమమని ప్రవక్త (స) సూచించారు. మంచి విషయానికి సంబంధించి ఇచ్చిన మాటను నెరవేర్చడానికి మన పూర్తి శక్తియుక్తులు వెచ్చించాలి. ఇందుకు మతిమరుపు లేకుండా ఉండటం, నిలకడతో కూడిన దృఢచిత్తం కలిగి ఉండటం అత్యవసరం. వాగ్దాన పాలనకు సంబంధించిన చైతన్యం మనలో వేళ్లూనుకుంటే జ్ఞాపకశక్తికి దృఢ నిశ్చయం తోడవుతుంది. అప్పుడు వాగ్దాన పాలనలో మరుపునకు అవకాశం ఉండదు. అలాంటి దృఢ చిత్తం కలిగిన వ్యక్తి విశ్వసనీయుల్లో ఒకరిగా ఉంటారు. మనం అల్లాహ్‌కు ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకొంటే.. ఆయన మనకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేరుస్తారు.

... ముహమ్మద్ ముజాహిద్, 96406 22076

## సేవించడం అంటే..

క్రీస్తు సందేశం



**ఒకసారి** ప్రభువు చుట్టూ శిష్యులు కూర్చొని ఉన్నారు. ప్రభువు మెల్లగా లేచి, ఓ చేత్తో పళ్లెం పట్టుకొని, మరో చేత్తో నీళ్ల లోటా తీసుకున్నారు. శిష్యుల్ని చేరి, మౌనంగా వారి ఒక్కొక్కరి పాదాలూ కడుగుతూ, నడుముకు చుట్టిన వస్త్రంతో తుడవ సాగాడు. అందరూ ఆశ్చర్యంతో ప్రభూ ఏమిటిదీ అనీ ఒక్కసారిగా ఆయన పాదాలపై పడిపోయారు. 'నేను మీకు చేస్తున్నట్టే, మీరు కూడా ఒకరికొకరు పరస్పరం ఇలానే చేసుకోవాలి' అనే సందేశం ఇచ్చాడు. చేయవలసిందాన్ని కేవలం చెప్పకుండానే ముందుగానే చేసి చూపించాడు ప్రభువు. మనం మనలోని అహంకారాన్ని తగ్గించుకోవడమే కాదు, ఇతరులనూ సేవించడం అవసరమని బోధించాడు. జగత్తుకు పాలకుడైన ప్రభువు.. తన అనుయాయుల పాదాలను కడిగి సేవాగుణం గొప్పదనాన్ని చాటిచెప్పాడు. ప్రజలను ఎలా సేవించాలో ప్రభుతకు బోధించాడు. ప్రజలను బిడ్డలుగా భావిస్తూ.. వారి అవసరాలను గుర్తెరిగి.. వాటిని నెరవేర్చడమే ప్రభుత్వం బాధ్యత.

... ప్రొ॥బెర్నార్డ్ రాజు, 98667 55024